శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## వితంతు పించనుకు మంజూరుకు ఉత్తర్వులు జారి

**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** ఎన్ టీ ఆర్ భరోసా సామాజిక పెన్షన్‌లు పంపిణీ కార్యక్రమములో భాగముగా ప్రభుత్వము గతములో నవంబరు 1, 2024 నుండి పించను తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానములో భార్యకు వితంతు పించను మంజూరు చేయుటకు వీలు కల్పించియున్నారు, అయితే నూతనముగా రాష్ట్ర ప్రభుత్వము క్షేత్ర పరిశీలనలో పరిశిలించి 01.12.2023 నుండి 31.10.2024 వరకు ప్రభుత్వము నుండి పించను తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానములో వారి భార్యలకు వితంతు పించను మంజూరుచేయడానికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారి ఛేస్యారు తదనుగుణంగా మండల/మున్సిపాలిటి లలో ఎంపిడిఓ, ఎంసిల వారి లాగిన్‌లలో నమోదు చేయుటకు ఆప్షన్ ఇవ్వబడిఉన్నది కనుక అర్హత కలిగిన వారు సంబందిత పత్రాలతో వార్డు/గ్రామా సచివాలయ సిబ్బందిని సంప్రదించ వలసిందిగా పీడీ, డిఆర్డిఏ నాగారాజ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు.

## కన్నీటి వీడ్కోలు మధ్య మధుసూధన్ అంతిమయాత్ర



**కావలి, ఏప్రిల్24 ప్రభాతవార్త** కన్నీటి వీడ్కోలుమధ్య కావలి వాసి సోమిశెట్టి మధుసూధన్ అంతిమయాత్ర గురువారం సాయంత్రం సాగింది. మధుసూధన్‌రావు అమర్‌రహే అన్న నినాదాలతో కావలి హోరెత్తింది. అంతిమయా త్రలో మంత్రులు సత్యకుమార్‌యాదవ్, నాదెండ్ల మనోహ ర్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, ఆర్డీఓ వంశీకృష్ణ, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ అంత్యక్రియల్లో మధు సూధన్ పాడెను మోశారు. కావలిపట్టణ ఆనాలవారి వీధి నుంచి బాలకృష్ణారెడ్డినగర్ శ్మశానవాటిక వరకు ఈ అంతిమయాత్ర సాగింది. ఈ అంతిమయాత్రలో మధు సూధన్ కుటుంబ సభ్యులు, పట్టణప్రముఖులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేటి నుండి నోషనల్ ఖాతాల స్పెషల్ డ్రైవ్

**- జాయింట్ కలెక్టర్ కార్తీక్**



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** జిల్లాలోని 95 వేలకు పైగా ఉన్న నోషనల్ ఖాతాల పరిష్కారానికి ఈనెల 25 నుండి నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. గురువారం వారి చాంబర్లో మీడియాతో మాట్లాడుతూ 1,84,298 సర్వే నంబర్లలోని 95,060 నోషనల్ ఖాతాలకు సంబంధించి ప్రతిరోజు జిల్లాలోని నాలుగు డివిజన్ల నుండి రెండేసి మండలాల చొప్పున మొత్తం రోజుకు 8 మండలాలకు సంబంధించిన నేషనల్ ఖాతాలను పరిశీలిస్తామన్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూములు, రిజిస్టర్డ్ భూములు, చుక్కల భూములు, పౌతి (మరణించిన వారి సంబంధించిన) సాదాబైనామా సంబంధించిన నోషనల్ ఖాతాలను పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామన్నారు. ఒక్క సాదాబైనమా భూములను నోషనల్ ఖాతాలోనుండి తప్పించేందుకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. మిగిలిన వాటికి సంబంధించి నోషనల్ ఖాతా సమస్యలను పరిష్కరించే వీలుందన్నారు. అందుకు సంబంధించిన పట్టాదారు వివరాలన్నింటినీ ప్రజా బహుళ్యానికి తెలిసేవిధంగా అప్లోడ్ చేస్తున్నామన్నారు. నోషనల్ ఖాతాలను రెగ్యులరైజ్ చేయనందువల్ల ముటేషన్లు, రిజిస్ట్రేషన్లు జరగకపోవ డంతో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులు ఒక్కరుగా వారి సమస్యల పరిష్కారం కోసం తిరగడం కాకుండా ఆయా మండలాల్లోని అన్ని నేషనల్ ఖాతాలను సాధ్యమ యినంతవరకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇందువల్ల దాదాపు 2,37, 000 మంది రైతుల సమ స్యలు పరిష్కా రమవుతాయన్నారు. తొలి రోజు పైలట్ ప్రాజెక్టుగా ఎనిమిది మండలాల నేషనల్ ఖాతాలను పరిశీలించి, ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ, తద్వారా అన్ని మండలాల్లోని నోషనల్ ఖాతాల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టండి

**: కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం స్థానిక 2 వ డివిజన్ సిరి గార్డెన్, నరుకూరు సెంటర్, గుడిపల్లిపాడు, బృందావనం గార్డెన్స్ తదితర ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజను వ్యాప్తంగా ప్రధాన డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని, ఖాళీ స్థలాల పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను ఆక్రమించకుండా వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణ సామాగ్రి వీధులకు అంతరాయం కల్పిస్తూ ఉంటే వారి నుంచి జరిమానా వసూలు చేయాలని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల ప్రకారం మాత్రమే కట్టుబడి జరిగేలా పర్యవేక్షించాలని అనుమతులు లేని అదనపు నిర్మాణాలు జరుగుతుంటే, ఆయా నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రామ్ మోహన్, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేయర్ తో నూతన కమిషనర్ భేటీ

**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పి. స్రవంతి జయవర్ధన్ తో కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.ఓ. నందన్ భేటీ అయ్యారు. కార్పొరేషన్ కార్యాలయం మేయర్ ఛాంబర్ లో గురువారం మేయర్ ను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమీషనర్ కి మేయర్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణ, పరిపాలన సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన సంస్కరణలు తదితర అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.



# ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి..!

**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్**





**కావలి, ఏప్రిల్24 ప్రభాతవార్త** భారతదేశంలో ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అశువులుబాసిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి ఆనాలవారి వీధిలోని నివాసంలో సోమిశెట్టి మధుసూధన్ భౌతికకాయాన్ని గురువారం డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయంపై పూలమాల ఉంచారు. భార్య, బిడ్డలను ఓదార్చారు. ఇద్దరు పిల్లలను అక్కునచేర్చుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. దాదాపు గంట పదినిముషాలపాటు కుటుంబసభ్యుల తో మాట్లాడి జరిగిన దారుణాన్ని అడిగి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. మధుసూధన్ దారుణ హత్యోదంతం అత్యంత హృదయవిదారక సంఘటన అని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు చేసిన దాడిని భారతదేశం మర్చిపోదన్నారు. బాధిత కుటుంబసభ్యుల బాధ, వారు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటల్లో చెప్పనలవికాదన్నారు.



మాటలు రావడంలేదని అంటూ భావోద్వేగానికి గురయ్యారు. జరిగిన సంఘటనను తలచుకుంటే తన కడుపు రగిలిపోతుందని తెలిపారు. పర్యాటకులను మీది ఏ మతం అని, ఏ ధర్మం ఆచరిస్తారని అడిగి మరీ ఉగ్రవాదులు ఘోరంగా, కిరాతకంగా తుపాకీగుళ్లతో చంపేశారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికో ఇక్కడికి రాలేదు. ఆ కుటుంబాలకు, ఆ బిడ్డలకు తోడుగా ఉంటామని భరోసా కల్పించేందుకే తాను కావలికి రావడం జరిగిందన్నారు. గత పదేళ్లుగా కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం ఉందని ఈ భరోసాతోనే పర్యాటకులు కాశ్మీర్ అందాలను చూసేందుకు వెళుతున్నారని పవన్‌కళ్యాణ్ తెలిపారు. 1986-89 మధ్యకాలంలో సినిమా షూటింగ్‌ల కోసం తాను కాశ్మీర్‌కు ప్రతి సంవత్సరం వెళ్లేవాడినన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉగ్రవాదులు దారుణాలకు తెగబడడంతో వారిని పూర్తిస్థాయిలో ఏరివేయాల్సిన సమయం మళ్లీ ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదుల దారుణాలపై మంగళగిరిలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేస్తారన్నారు. విశాఖపట్నానికి వెళ్లి అక్కడ పరామర్శించి వస్తానన్నారు. ఉగ్రవాదుల అణచివేతకు భారతప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌యాదవ్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్టీసి ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రికి చెప్పుకోండి... అంటూ ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపారు

**రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం**





**కావలి, ఏప్రిల్24 ప్రభాతవార్త** మీ ప్రధానమంత్రికి చెప్పుకోండి... అంటూ ఉగ్రవాదులు 28 మంది భారతీయులను పేర్లు అడిగి పాశవికంగా కాల్చిచంపడం అత్యంత బాధాకరమైన విషయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఉగ్రవాదుల చర్యలను పిరికిపందల చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం గురువారం కావలి ఆనాలవారివీధిలోని మధుసూధన్ నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబస భ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. ఉగ్రవాద సంస్థలను తుదముట్టించేందుకు మేము తోడుగా ఉన్నామని చెబుతూ అన్ని దేశాలు ఒకేత్రాటిపైకి వస్తున్నాయ న్నారు. మన ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు విశాఖపట్నంలో, మరొకరు కావలికి చెందిన వాసి చంపబడడం అతి దారుణమన్నారు. సోమిశెట్టి మధుసూధన్ పార్థివదేహం కాలవికి వచ్చినప్పటి నుంచి జిల్లా యంత్రాంగం అంతా ఇక్కడే ఉందన్నారు. ప్రభుత్వం కూడా అన్నిరకాలుగా అండగా ఉంటుందన్నారు. శాంతి సామరస్యానికి ప్రతిరూపమైన ఈ భారతదేశంలో ఈ ఉగ్రవాదచర్య హేయమైన చర్య అని ఆనం ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఇటువంటి ఘటనలను ఎవరూ సమర్థించరన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారందరికి కేంద్రప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంకూడా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నాయన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూధన్ కుటుంబం నెల్లూరులో మా పక్కవీధిలో ఉండేవారన్నారు. వారి కుటుంబంతో తమకు మంచి అనుబంధం ఉందని మంత్రి ఆనం తెలిపారు. మధుసూధన్‌ను కోల్పోవడం తమ కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లుగా భావిస్తున్నా న్నారు. మధుసూధన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పదిలక్షల రూపాయలు ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. మధుసూధన్ కుటుంబసభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఆనం తెలిపారు.

**ఏప్రిల్ 22 దేశచరిత్రలో ఒక చీకటిరోజు... మంత్రి సత్యకుమార్ యాదవ్** ఏప్రిల్ 22 దేశచరిత్రలో ఒక చీకటిరోజుగా నిలిచిపోతుందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. మధుసూధన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో సమర్థవంతమైన నాయకత్వంలో గత పదేళ్లుగా జమ్ముకాశ్మీర్ ప్రశాంతంగా ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్ముకాశ్వీర్‌లో మతం పేరుతో అత్యంత పాశవికంగా మారణహోమం సృష్టించి చంపడం భారతీయుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో భారతీయులు కాల్చిచంపబడ్డారన్న సమాచారం తెలిసిన కొన్ని గంటలలోనే సౌదీఅరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడి వెంటనే భారత్‌కు తిరిగి వచ్చేశారన్నారు. హోమ్ మంత్రి అమిత్‌షా జమ్ముకాశ్మీర్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయని వారి బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు.

**-ఇది పిరికిపందల చర్య... సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి** ఉగ్రవాదులు భారతీయులను తుపాకులతో చంపడం పిరికిపందల చర్య అని సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కావలిలో మధుసూధన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదుల కిరాతక చర్యలకు సంబంధించి కనీసం పాకిస్తాన్ సరైన పద్ధతిలో సానుభూతినికూడా తెలుపలేదని సోమిరెడ్డి మండిపడ్డారు. ఈ ఉగ్రవాదులను వదిలే ప్రసక్తేలేదని హెచ్చరికలు చేశారు. భాంతేజోలికి వచ్చినవారు భారీమూల్యం చెల్లించుకోక తప్పదని సోమిరెడ్డి హెచ్చరించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విప్లవత్మాక మార్పు పై అబద్ధపు ప్రచారం : ధ్వజమెత్తిన పర్వత రెడ్డి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మద్యం మాఫియాకి వ్యతిరేకంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో పారదర్శకంగా ఉండేలా ఒక మంచి మార్పుని తీసుకు వచ్చారు. అద్భుతమైన ఈ మద్యం పాలసీ మీద చంద్రబాబు నాయుడు తనకి అలవాటు అయిన అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి సంబందించి గత 2024 సెప్టెంబర్ లో ఒక కేసుని ఫైల్ చేసి అక్టోబర్‌లో 20 డిస్లరీలపై దాడులు జరిపి 8 నెలలు సిఐడి విచారణ చేసి, ఒక్క ఎవిడెన్స్ కూడా టిడిపి ప్రభుత్వం సంపాదించలేకపోయిందని దుయ్యబట్టారు. గత మద్యం పాలసీ విధానాలపై వాసుదేవ రెడ్డి, సత్య ప్రసాద్ రెడ్డి వద్ద తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేసి కన్ఫెక్షన్ స్టేట్‌మెంట్ ఆదారంగా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పై అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇదే వాసుదేవ రెడ్డి ఇచ్చిన కంప్లైంట్‌తో టిడిపి ప్రభుత్వం చేసిన మద్యం కుంభకోణంలో చంద్రబాబు నాయుడుని ఏ 3గా పేర్కొంటూ సిఐడి కేసు నమోదు చేసిందన్నారు. ఆ కేసుకు సంబంధించి సిఐడి దగ్గర పూర్తి ఆదారాలు ఉన్నాయని అన్నారు. ఈరోజు ఆ కేసును పక్కదారి పట్టించేందుకే అదే వాసుదేవ రెడ్డి, సత్య ప్రసాద్ రెడ్డితో తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయించి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైస్సార్సీపీ మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో కేవలం క్యాష్ ట్రాన్సాక్షన్స్ మాత్రమే జరిగాయని, టిడిపి ప్రజల్లో అవాస్తవాలను ప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో నిబంధనలకు అనుగుణంగానే క్యాష్ ట్రాన్సాక్షన్‌తో పాటు ఆన్ లైన్ ట్రాన్సాక్షన్ అన్నింటిని అందుబాటులో ఉంచామని అన్నారు. క్యాష్ కలెక్షన్ వస్తే ఏ రోజు కలెక్షన్‌ని ఆ రోజు బ్యాంకులో సదరు షాపు లోని ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ ఏపిఎస్‌బిసిలో డిపాజిట్ చేయడం 100 శాతం జరుగుతుంది. ఇది వాస్తవం ఇప్పుడు టిడిపి ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా. ఇది కాదు అని చెప్పగలరా.. నిరూపించగలరా అని ప్రశ్నించారు. అది మానేసి ఈరోజు వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన మద్యం పాలసీ విధానాలను తప్పు పట్టడమే.. పనిగా టిడిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం పదేపదే అబద్ధాలు చెబుతూ.. అదే నిజమనే భ్రాంతిలో.. ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తుందన్నారు. సాఫ్ట్ వెర్ గురించి మద్యం పాలసీ విషయంలో గతంలో టిడిపి తీసుకువచ్చిన ప్రైవేటు సిటెల్ సాఫ్ట్వేర్‌ను జగన్మోహన్ రెడ్డి రద్దుచేసి ప్రభుత్వ షాపులకు అనుగుణంగా అద్భుతమైన విశిష్ట సాఫ్ట్వేర్ తీసుకొచ్చి మద్యం పాలసీని మరింత పారదర్శకంగా నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కూడా అదే సాఫ్ట్ వెర్‌ని ఉపయోగిస్తావుంది. దీని మీద కూడా అసత్యాలు మాట్లాడుతున్నారు. టిడిపి ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా బెల్టు షాపులను తీసుకువస్తే.. జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత 43 వేల బెల్ట్ షాపులను రద్దు చేశారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కొత్త డిస్లరీలను కాని, కొత్త బ్రాండ్ ని కూడా.. తీసుకురాకుండా.. ఉన్న అన్ని డిస్లరీలను కొనసాగించింది .. గతంలో టిడిపి ప్రభుత్వం తన స్వంత మనుషులు అయిన 4 డిస్లరీలను 50 పైగా స్టాకు ప్రొక్యూర్ మెంట్ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం మద్యం షాపుల్లో ప్రతి ఒక్క మద్యం సీసాను స్కానింగ్ చేసి మరి పూర్తి పారదర్శకంగా అమ్మకాలు జరిపేమన్నారు. ఆ డేటా కూడా ఇప్పుడు ప్రభుత్వం దగ్గర ఉంది. ఆ పద్దతి టీడీపీ ఎప్పుడు అమలు చేయలేదు. అంతా దోపిడీ మాత్రమే జరిగింది. టిడిపి ప్రభుత్వంలో ఉన్న 4300 మద్యం షాపులను.. జగన్మోహన్ రెడ్డి ఇళ్ల మధ్యన, మసీదులు, దేవాలయాల దగ్గర ఉండే వాటిని తొలగించి కేవలం 2934 షాపులకు కుదించి.. మద్యం నిత్యం అందుబాటులో ఉండకూడదు అన్న కారణంతో అమ్మకాలు జరిపారని తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి.. 20,000 మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఈరోజు కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ విషయంలో.. అక్రమాలకు పాల్పడ్డమే కాకుండా.. మద్యాన్ని విచ్చలవిడి చేసిందని ఆరోపించారు. ఈరోజు ప్రజలు వద్దు అని మొత్తుకుంటున్నా టి డి పి ప్రభుత్వం వినకుండా.. ఇళ్ల మధ్య, అపార్ట్మెంట్ల వద్ద, దేవాలయాలు స్కూలు మసీదులు ఉండే ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి.. ప్రజలను ఇబ్బంది గురి చేస్తున్నారని ఆరోపించారు. మద్యం షాపుల్లో అనధికారికంగా పర్మిట్ రూములు పెట్టి .. 24/7 అంటే రాత్రి సమయంలో సైతం అమ్మకాలను ప్రోత్సహిస్తూ.. మద్యం అమ్మకాల్లో దుకాణదారులకు 20 పెంచి టార్గెట్లు పెడుతూ మద్యం విచ్చలవిడిగా దొరికే లాగా.. ఈరోజు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు.. పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దీంతో మద్యం తాగే వారు ఎక్కువయిపోయి.. ఇళ్లల్లో వస్తువులు, మంగళ సూత్రాలు.. కుదువ పెట్టి.. తాగుతూ.. జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. టిడిపి తీసుకొచ్చిన మద్యం విధానాల వలన.. మద్యం విచ్చలవిడిగా దొరకడంతో.. శాంతి భద్రతలు క్షీణించి.. రోడ్లపైనే హత్యలు చేసుకునే పరిస్థితికి.. ఆంధ్రప్రదేశ్ చేరుకుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయవలసి వస్తుందనే కారణంతో టిడిపి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా ఇలాంటి సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తుందని దుయ్యబట్టారు.

## పహల్గాంలో అమాయకుల్ని చంపిన ఉగ్రవాదులను హతమార్చాలి



**బుచ్చి ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పహల్గాంలో అమాయకుల్ని చంపిన ఉగ్రవాదుల్ని హతమార్చాలని ,ఉగ్రదాడులను ఖండిస్తు కొవ్వొత్తులతో ర్యాలీ బిజెపి నాయకులు నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలాద్యక్షులు సిద్దన మనోహర్‌రెడ్డి ఆద్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది పిరికిపంద చర్య అని వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికారప్రతినిది గంజం పెంచలప్రసాద్, సీనియర్‌నాయకులు ఇనుగూరు బాలయ్య, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కనిగెల్పుల గిరి, కోవ్వోలు మస్తానయ్య, ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శి మహిమలూరు సతీష్, మండల ప్రధానకార్యదర్శి గెండి పెంచ క్రిష్ణ, సీనియర్ నాయకులు నీలం వెంకటేశ్వర్లు ,మచ్చా కోటేశ్వరరావు, గుంజి మల్లికార్జున, సామాజిక సమరసతాపౌండేషన్ మండల కన్వీనర్ అండగుండ శ్రీనివాసులు భూమిరెడ్డి ,రవీచంద్రారెడ్డి, ఒక్క విజయ్ నాయకులు పెజ్జాయి ప్రసన్నకుమార్‌రెడ్డి, గుడి అంకయ్య, మండల ఉపాధ్యాక్షులు మెడెం నిరంజన్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం



**వరికుంటపాడు, ఏప్రేల్24, ప్రభాతవార్తః** రాష్ట్రంలో వున్న ప్రతి గ్రామాన్ని అభివృద్ది చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జట్‌పిటి సభ్యులు రావెళ్ళ నాగేంద్ర, రాష్ట్ర గిరిజన కార్పొ రేషన్ డైరెక్టర్ ఆవులఅరుణ అన్నారు. జాతీయ పంచాయతిరాజ్ దినోత్సవ సందర్భంగ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గొట్టిపాటి వేణుగోపాల్‌రావు ఆద్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారుముందుగ గాందీజి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులరి ్పంచారు. ఈసందర్బంగ జట్‌పిటిసి నాగేంద్ర మాట్లాడుతు సామాన్య ప్రజలు అభివృద్ది చెందాలన్న సంకల్పంతో పంచాయతిరాజ్ వ్యవస్థను ఏర్పాటుచేశారన్నారు. గ్రామ స్థాయినుంచి ప్రజా అవసరాలు మౌలిక వసతులను కల్పించడంలో పంచాయతిరాజ్ వ్యవస్థ విశేషంగ పనిచేస్తుందని కొనియాడారు. గాందీజి కలలుకన్న గ్రామస్వరాజ్య స్థాపనలో ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. వరికుంటపాడు సచివాలయంలో గ్రామసర్పంచ్ కొండిపోగు దిలిప్‌కుమార్ ఆద్వర్యంలో జాతీయ పంచాయతిరాజ్ దినోత్స వాన్ని నిర్వహించారు. ఈసందర్బంగ మాజి సర్పంచ్ మట్టే హరినారాయణనుఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో నక్కలగండి డామ్ చైర్మన్ మధు, డిప్యూటి ఎంపిడిఒ నాగూర్‌వలి, డిప్యూటి తహసిల్‌దార్ చెంచయ్య, ఎపిఒ అజామ్‌ఖాన్, ఎపిఎం సుధాకర్‌రావు, ఎఒరవికుమార్, సిహెచ్ఒ రాజశేఖర్‌రాజుతదితరులు పాల్గొన్నారు.

## చేపట్టే నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కోవూరు ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని 7 వసతి గృహాల్లో ప్రస్తుతం జరుగుతున్న వసతి గృహ మరమ్మతుల పనులు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య అన్నారు. కోవూరులోని ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో గురువారం ఆయన 7 వసతి గృహాలకు సంబంధించిన సంక్షేమాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేలా సంక్షేమాధికారులు తగు చొరవ తీసుకో వాలన్నారు. అదేవిధంగా పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన గృహాల సంక్షేమా ధికారులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు వెంకట్రావు, వెంకటయ్య, నాగరాజు, పద్మ, మేరీ సుప్రజ, నాగలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్, తదితరులు ఉన్నారు.

## మహాత్మునికి ఘన నివాళులు



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న రాజ్యాంగం చట్టం ద్వారా పంచాయతీరాజ్ స్థాపించబడిందన్నారు. 2010 సంవత్సరంలో అప్పటి భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఏప్రిల్ 24వ తేదిన మొదటి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రకటించారన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవవేడుకలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్, కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి , జూనియర్ అసిస్టెంట్ , టైపిస్ట్, తదితరులు ఉన్నారు.

## పనులు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న వివిధ మరమ్మతుల పనులు మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్ పనులు పొందిన కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన సంక్షేమ వసతి గృహాల్లో జరుగు తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే పనుల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసనిగా ఉండాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు పద్మ, మేరీ సుప్రజ, తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

## మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** జమ్మూ కాశ్మీర్‌లో తీవ్రవాదులు టూరిస్ట్‌లపై దాడి చేయడాన్ని నిరసిస్తూ కోవూరు కూటమి నాయకులు హిందూ బంధువుల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బజార్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లోని ప్రహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల ఘటన పిరికి పంద చర్య అన్నారు. ఇటువంటి దుశ్చర్యలు మరలా పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఉగ్రవాదుల దాడిలో మరణించిన భారతీయుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనే ధైర్యాన్ని భగవంతుడు వారికి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ క్యాండిల్ ర్యాలీలో కూటమి నాయకులు మల్లారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, విజయకుమార్, మధుసూదన్‌రావు, అశోక్‌కుమార్, మదన్‌రెడ్డి, సాయిరెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవరెడ్డి, లోకేష్, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, పోలిశెట్టి సుబ్బారావు, చక్రవర్తి, వంశీకృష్ణ, అల్తాఫ్, మున్వర్, శివకృష్ణ, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బీమా పథకాలపై పొదుపు సభ్యులు మరింత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటున్న పొదుపు గ్రూపు సభ్యులు బీమా పథకాలపై మరింత అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కోవూరు మండలంలోని 33 సంఘ బంధ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంజేజేబీవై పథకం ఈ పథకంలో చేరితే ప్రమాదంలో చనిపోతే వారికి మరింత బీమా సౌకర్యం వస్తుందని, సాధారణంగా మరణించినా కూడా బీమా సౌకర్యం వస్తుందన్నారు. అదేవిధంగా పొదుపు మహి ళలను లక్ష్యాధికారులుగా చేయాలనే ప్రభుత్వ సూచనల మేరకు పొదుపు గ్రూపుల్లో ఉత్సాహంగా ఉన్న సభ్యులను గుర్తించి ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాలపై వారు దృష్టి సారించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా స్త్రీనిధి, ఉన్నతి సీఐఎఫ్ రుణాలను క్రమం తప్పకుండా చెల్లించి రికార్డు, రిజిస్టర్ల నిర్వహణ పారదర్శకంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు రమ్య, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోసంఘమిత్ర అధ్యక్షురాలు సీహెచ్ రమ్య ఉపాధ్యక్షులు ఎస్‌కే ఆసియా, కార్యదర్శి డి. లక్ష్మి, సంయుక్త కార్యదర్శి పి. యామిని, కోశాధికారి జి. ప్రియాంక సీసీలు రాజ శేఖర్, చైతన్య, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## గంగపెట్టెను కోడూరు బీచ్‌లో నిమజ్జనం



**మనుబోలు ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలలోని శ్రీశ్రీశ్రీ గంగమ్మ ఆలయంలో ఉన్న గంగపెట్టె 18 ఏళ్ళు పూర్తి అవడంతో ఆపెట్టను సమీపంలోని కోడూరు బీచ్‌రోడ్డు వద్ద నిమజ్జనం చేసి అనంతరం అక్కడ నుండి నూతన గంగపెట్టెను మనుబోలులోని గంగమ్మ గుడి వద్దకు తీసుకుని వస్తున్నట్లు యాదవ సంఘం కమీటి తెలిపారు. ఈ సందర్బంగా గంగమ్మ ఆలయం వద్ద నుండి గంగపెట్టను వాహనంలో కొమ్ము మేళాలతో తీసుకొని వెళ్ళడం జరిగింది. ఈ సందర్బంగా నూతన గంగపెట్టెను దుగ్గన రమేష్ శరణ్య దంపతులు అందించడం జరిగింది.

## మంత్రులతో సమావేశమైన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



**కావలి, ఏప్రిల్24 ప్రభాతవార్త :** కావలి పట్టణం ఆనాలవారివీధిలో సోమిశెట్టి మధుసూధన్ నివాసంవద్ద గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రులతో, ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, మంత్రి నాదెండ్ల మనో హర్, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తదితరులతో కొద్దిసేపు పలువిషయాలపై పవన్ కళ్యాణ్ చర్చించారు. భారీ పోలీసు బందోబస్తుమధ్య ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మధుసూధన్ నివాసానికి వచ్చారు.

## కాశ్మీర్ ఉగ్రవాద నరమేధాన్ని ఖండించిన బిజెపి జిల్లా నేత బోలా శ్రీను



**మనుబోలు ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పాకిస్ధాన్ ఉగ్రవాద సంస్థ లష్కర్‌తోయిబా అనుబంధ సంస్థ హిందువులే లక్ష్యంగా చేసుకోని అమాయక పర్యాటకులను 26 మందిని కిరాతకంగా కాల్చి చంపడం హేయమైన చర్య అని ఈ మారణకాండలో నెల్లూరు జిల్లా కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉగ్రవాదుల కాల్పులకు గురికావడం జిల్లా వాసులను కలిచి వేసిందని బిజెపి జిల్లా నేత బొలా శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మనుబోలు మండలంలోని కాగితాలపూరు గ్రామంలో బోలా శ్రీను ఆద్వర్యంలో మారణకాండకు వ్యతిరేఖంగా బిజెపినాయకులు కార్యకర్తలు పాకిస్తానకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ప్రపంచ దేశాలు అన్ని కూడా పాకిస్ధానను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల పట్ల హిందువులు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని ఇలాంటి దాడులను ఉపేక్షించకూడదని అడ్డుకట్ట వేసేందుకు భారతీయులంతా ఐక్యంగా ముందుకు రావాలని తెలియజేశారు. ఈ ఉగ్రమూకలను సమూలంగా అరికట్టాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులున్నారు.

## ఆక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు



**కొడవలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండలంలో మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించినట్లయితే కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఎంతటి వారైనా సరే ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు, మండలంలో కొంతమంది అనాధకరంగా మట్టి తరలింపు చేస్తు న్నారు. అలాంటి వారిపై రెవెన్యూ నిఘా ఉంచి చర్యలు తీసు కుంటామని తెలియజేశారు.

## కావలి రూరల్ కానిస్టేబుల్ సూరిశెట్టి రమేష్ మృతి



**కావలి, ఏప్రిల్24 ప్రభాతవార్త :** కావలిరూరల్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సూరిశెట్టి రమేష్ చెన్నైలోని ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ చికిత్సపొందుతూ మృతిచెందారు. కుటుంబసభ్యుల రోదనలు వర్ణణాతీతంగా మారాయి.

## చేవూరు ప్రభయ్య దాతృత్వంతో చలివేంద్రం ఏర్పాటు



**కావలిరూరల్, ఏప్రిల్24 ప్రభాతవార్త :** కావలి వెంగళరావునగర్‌లో హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య దాతృత్వంతో గురువారం చలి వేంద్రం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవాసంస్థ అద్యక్షులు సయ్యద్ ఘనీబాషా, గౌరవ అద్యక్షులు షేక్. ఖాదర్‌బాషాలు మాట్లాడారు. చేవూరు ప్రభయ్య తన స్వంత నిధులతో చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలియచేశారు. పూర్తిగా వేసవికాలం ముగిసేవరకు వాటర్‌క్యాన్లు తన స్వంత నిధులతో అందిస్తానని ముందుకు వచ్చిన ప్రభయ్య దాతృత్వం మరువలేనిదని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీసేవాసంస్థ ఉపాద్యక్షులు దేవరకొండ విజయ్, జాగో సేవాసంస్థ అద్యక్షులు షేక్.జమీర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ ఉదయగిరిలో జనసేన మౌన దీక్ష



**ఉదయగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఈ దుశ్చర్యలో మృతి చెందిన వారికి సంతాప సూచికంగా ఉదయగిరిలోని బస్టాండ్ సెంటర్ నందు ఉదయగిరి నియోజకవర్గం పీఓసీ కొట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు కల్లూరి సురేంద్ర రెడ్డి అధ్యక్షతన జనసేన పార్టీ మౌన దీక్ష చేపట్టింది. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గం పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులు సంతాప దినాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఉదయగిరి పట్టణంలో తీవ్ర వాదుల దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తూ మౌన దీక్ష చేపట్టడం జరిగిందని కాశ్మీర్‌లో పర్యాటకులను, ముష్కరులు కాల్చి చంపటం దారుణమని, మృతులకు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలపడం జరిగిందని, దేశంలో ఉగ్రవాదులను అణచివేయాల్సిన అవసరం ఉందని, పర్యాటకులపై విచక్షణారాహితంగా కాల్పులు జరపడం అత్యంత హేయమైన చర్య అని వ్యాఖ్యానించారు. వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉగ్రవాదుల చర్యలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉగ్రవాదులను సమూలంగా, అణచి వేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం, కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మృతుల్లో కావలి వాస్తవ్యుడు జనసేన సైనికుడు సోమిశెట్టి మధుసూదనరావు, ఉండటం, అత్యంత బాధాకరమైన విషయం అని తెలిపారు. వారికి సంతాపం తెలియజేస్తూ వారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఆల్లూరి రవీంద్ర, ఉదయగిరి మండల అధ్యక్షులు కల్లూరి సురేంద్ర రెడ్డి, రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు కమతం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు బయన్న, బీజేపీ నాయకులు రోశయ్య, దుత్తలూరు మండల అధ్యక్షులు రవికుమార్, వింజమూరు అధ్యక్షులు బండారు సత్యనారాయణ, వరికుంటపాడు మండల అధ్యక్షులు రసూల్ పటాన్, కలిగిరి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన వీర మహిళ సరిత, ఉదయగిరి మండల సీనియర్ నాయకులు కుర్ర కృష్ణ యాదవ్ ఉదయగిరి పట్టణ నాయకులు నాకెళ్ళ రవి, ఉదయగిరి మండల ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, జనసేన సైనికులు గువ్వల వెంకీ, లిఖిత్, వెంకట ప్రసాద్, 8 మండలాల జనసేన కార్యకర్తలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతసాగరం పిహెచ్‌సిని తనిఖీ చేసిన డబ్ల్యుహెచ్ఒ



**అనంతసాగరం, ఏప్రిల్24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) వైద్యనిపుణులు డాక్టర్ భవాని రామకృష్ణన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్షయవ్యాధికి సంబంధించిన పలు ల్యాబ్ రికార్డులు, గల్లపరిక్షలను తనిఖీ చేశారు. క్షయవ్యాధిగ్రస్తులతో నేరుగా మాట్లాడి సకాలంలో మందులు, చికిత్స అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజలకు రెండువారాలకు పైబడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, నీరసం రాత్రిపూటల్లో చెమట పట్టడం వంటి లక్షణాలుంటే గల్ల పరీక్ష చేయించుకోవాలని, అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదునాతన ల్యాబ్ ఉందని గ్రామప్రజలకు సూచించారు. వైద్యశాల పనితీరుపై డాక్టర్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నిషియన్ మీరామొహిద్దీన్‌ను ఆమెఅభినందించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రావణి, టిబి సూపర్‌వైజర్లు సుధాకర్, వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తీవ్రవాదులు దాడికి నిరసనగా కొవ్వొత్తులు ర్యాలీ



**అల్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కాశ్మీర్ లోయలో పహాల్గామా టూరిస్ట్ ప్రదేశంలో తీవ్రవాదులు దాడిని ఖండిస్తూ అల్లూరు పాత బస్టాండ్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్ రాజు మాట్లాడుతూ కాశ్మీర్ లోయలో మారణకాండము సృష్టించడం పరికిపందల చర్యని తీవ్రవాదులను వెంటనే ఏరిపారేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు చనిపోయిన వారి ఆత్మ శాంతి కలగాలని వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్న మన్నారు కార్యక్రమంలో కోవూరు బాబురావు. కాకాని యశ్వంత్. సాయికుమార్ పొంగులూరు సుధాకర వేణుగోపాల్. కరుణాకర్ అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు

## భూసార పరీక్షలు తప్పనిసరి ఏవో శ్రీలక్ష్మి



**కొడవలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండలంలోని దామేగుంట, తలమంచి గ్రామాలలో భూసార పరీక్షలు పై రైతులకు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల యొక్క అవశ్యతను తెలియపరచడం జరిగింది. అనంతరం నూతన పంటలో మట్టి స్వీకరించిన నమూనా ఫలితాలను రైతులకు వెల్లడించడం జరుగుతుందని తద్వారా రైతన్నలు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ వెంకటరావు, వి ఏ ఏ ప్రసాద్, లిఖిత, తల మంచి సర్పంచ్ భాస్కరరావు, స్థానిక నాయకులు కృష్ణయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

**కందుకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ సోమవారం ఉదయం టీఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నందు జరుగు జాబ్ మేళాను నియోజకర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. జాబ్ మేళా కు హాజరు కావాలనుకునే నిరుద్యోగ యువతీ, యువకులు ముందుగా ఈ క్రింది వెబ్ సైట్ ద్వారా వివరాలను నమోదు చేయించుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని తెలియజయడమైంది. వెబ్‌సైట్ లింకు హెచ్‌టీటీపీఎస్://ఎన్ఏఐపీయుఎన్‌వైఏఎం. ఏపీ. జీవోవీ. ఇన్/యూజర్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9848050543, 6301543185, 7286822789 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

## కోవూరులో ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



**కందుకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** మండలంలోని కోవూరు గ్రామ సచివాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుక ఘనంగా జరిగింది. సర్పంచ్ ఆవుల మాధవరావు ఆధ్వర్యంలో ఈ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా పల్లె ప్రగతి, దేశానికి ప్రగతి, ప్రజాస్వామ్య చరిత్రలో పంచాయతీలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. గ్రామ పంచాయతీ సక్రమ నిర్వహణ దేశానికే ప్రగతి అభివృద్ధికి సూచిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహ, సచివాలయ సిబ్బంది, నాయకులు రమణయ్య, మహీంద్రా, వెంకటేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**మర్రిపాడు, ఏప్రిల్24,ప్రభాతవార్త:** మండలంలోని చిలకపాడు ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన ఒ.వి. రాధాకృష్ణమూర్తిని పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధు మిత్రులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుహాసిని చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు నడదు ప్రోత్సాహకాలు



**ఇందుకూరుపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, యువ నాయకులు దువ్వూరు కళ్యాణరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డిల స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తూ పదో తరగతి పరీక్షల్లో మండలంలో మొదటి స్థానం సంపాదించిన గుడి భార్గవ్‌కు సుహాసిని చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.25వేలు ప్రోత్సాహం, రెండో స్థానం వచ్చిన నేహా ఫర్హత్‌కు సిగమాల పుల్లమ్మ మెమోరియల్ తరుపున రూ.10వేలు ప్రోత్సాహకంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, విజయ, షేక్ షఫీ, కనుమూరు మధుసూదన్‌రెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, మండల నాయకులు ఎంఈఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా అమ్మ చారిటబుల్ ట్రస్టు



**ఇందుకూరుపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** కోవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు ప్రశాంతమ్మ స్ఫూర్తితో స్థాపించిన అమ్మ చారిటబుల్ ట్రస్టు తరుపున ప్రశాంతమ్మ చేతుల మీదుగా కుడితిపాలెం గ్రామంలో 591 మార్కులు వచ్చిన షేక్ నేహా ఫర్హాత్‌కి, 586 మార్కులు వచ్చిన నెల్లూరు హారికకు అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు దొడ్ల మల్లిఖార్జున్, శ్రీలేఖలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక నగదును ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక నగదును అందజేశారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో విద్యార్థులకు ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీల్, హెడ్ మాస్టర్ సదానందం, పీఈటీ ముజీర్, కుడితిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు అప్పాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన కృష్ణమోహన్



**లింగసముద్రం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** గ్రామాల్లో ఉన్న చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ పంచాయతీ కార్యదర్శి కే.కృష్ణ మోహన్ చెప్పారు. మండలంలోని చిన్న పవని, పెద్ద పవని గ్రామంలో జరుగుతున్న ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త సేకరణను గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కట్టా శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రాలకు పలు సూచనలు ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నపవని సర్పంచ్ దామ సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి రషీద్ పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

**లింగసముద్రం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :** ప్రభుత్వం షెడ్యూల్ కులాల వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల కొరకు ఆన్‌లైన్ చేసుకొనుటకు మే 13వరకు గడువు పొడిగించిందని ఎంపీడీఓ కే.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ అవకాశంను అర్హత కలిగిన ఎస్సీ లబ్దిదారులు వినియోగించుకోవాలన్నారు. దరఖాస్తుల వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు ఉండాలని, ఆధార్ కార్డు, కాస్ట్ సర్టిఫికేట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్, రేషన్ కార్డు, ఫొటో ఒకటి, ఆధార్ నెంబర్‌తో లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో ఆయా గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో వేలంపాట

**అల్లూరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** అల్లూరు గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు ను గురువారం ఉదయం బహిరంగ వేలం పాటలును ఆలయ చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి దేవాదాయ శాఖ అధికారి భక్తుల సమక్షంలో నిర్వహించగా 47,850 రూపాయలు వేలంపాట ద్వారా ఆదాయం వచ్చినదని తెలిపారు

## చిన్నారులకు పౌష్టికాహారం అందించిన టైటస్ నిర్మల్ కుమార్



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అనే ఆయన ఆలోచన.. ఆలోచన వచ్చింది తడువుగా సమాజానికి సేవ చేయాలని సంకల్పంతో ఆయన తన వంతు స్వయంగా సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించే దాంట్లో ఎప్పుడు వెనకడుగు వేయడు. ఆయనే నిర్మల్ కుమార్, అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్మల్ కుమార్ 300 మంది చిన్నారులకు పౌష్టికాహారం గురువారం కొండాయపాలెంలోని ట్రస్ట్ నందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ మాట్లాడుతూ, చిన్నపిల్లల పై జరుగు అకృత్యాలకు, బాల కార్మికుల సమస్యల పై, బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సమస్యలు ఎదుర్కొనుటకు మనిషికి ధైర్యం చాలా అవసరం అని చెప్పారు. ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ టైటస్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ వారు మెడిసిన్ ఇస్తారు, మా అబైడింగ్ హోప్ ట్రస్ట్ వారు పౌష్టికా ఆహారం ఇస్తారు అని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అనేకమంది చిన్నారులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ లివింగ్స్టోనే, క్రాంతి, శశి, రమ, బాబు, పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



**బిట్రగుంట ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ప్రకృతి విపత్తులు వస్తే ముందు జాగ్రత్తలు తీసుకుంటే దానివల్ల కలిగే ముప్పుని తప్పించవచ్చని కావల ఆర్డీవో వంశీ కృష్ణ చెప్పారు బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో గురువారం రాష్ట్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన దళం ఏర్పాటుచేసిన కార్యక్రమాలపై వీర ప్రాంతంలోని మత్స్యకారులకు అవగాహన కలిగించారు ప్రధానంగా తీర ప్రాంతాలలో తుఫానులు సునామీలు అగ్ని ప్రమాదాలు వంటివి తరచూ సంభవిస్తుంటాయని ఇటువంటి సమయంలో మత్స్యకారులు వీటిని ఎదుర్కొనేందుకు ఆయా శాఖలు చూపించే ముందు జాగ్రత్తలపై అవగాహన పెంచుకుంటే ధన నష్టం ఆస్తి నష్టం ప్రాణా నష్టం అరికట్టవచ్చని ఆయన తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రకృతి విపత్తుల ప్రతి స్పందన దళం నిర్వహించిన మాక్ డ్రిల్ లో వివిధ శాఖలు ప్రదర్శించిన కార్యక్రమాలను ఆయన తిలకించి గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిట్ 1 సచివాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలు



**రాపూరు,ఏప్రిల్24ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని బిట్ 1 సచివాలయంలో గురువారం జాతియ పంచాయితీ రాజ్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో బాగంగా జాతిపిత మహాత్మా గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి, పంచాయితీలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను పంచాయితీ కార్యదర్శి కవిత సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు ఆరీఫా, శింగంశెట్టి గౌరమ్మ, ఆరోగ్య కార్యకర్త హరిత, పిషరిష్ అసిస్టేంట్ కమల పలువురు పంచాయితీ సిబ్బంది, సచి వాలయం సిబ్బంది తదితరులున్నారు.

## పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాల అభివృద్ధి



**రాపూరు,ఏప్రిల్24ప్రభాతవార్త :** పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవాని తెలిపారు. గురువారం రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యలయంలో జాతియ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రజాప్రతినిధులైన రాపూరు యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న, జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్నను యంపీడీఓ సన్మానించగా,యంపీడీఓ భవానీని, మండల విస్తరణాధికారి బాలకృష్ణా రెడ్డిని పంచాయితీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బంది సత్కరించారు. అనంతరం పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని గురించి ఆమె మాట్లాడుతూ 1992లో భారత రాజ్యాంగం 73వ చట్ట సవరణ ద్వారా గ్రామ, జిల్లా స్థాయిలలో గ్రామ పంచాయితీల ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. 1993 ఏప్రిల్ 24 నుండి ఆ సవరణ అమలులోకి వచ్చిందన్నారు. 2010 ఏప్రిల్ 24న దివంగత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ తోలిసారిగా జాతియ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించరని తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయితీ రాజ్ సంస్థలు సక్రమంగా పనిచేస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యలయం పరిపాలనాధికారి దామోదర్ రెడ్డి, సీనియర్,జూనియర్ సహాయకులు, సిఓ పి.చంద్రశేఖర్,ఉదయిని,కరుణాకర్, తెలుగుదేశంపార్టీ మండల ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి,ఇరిగేషన్,హౌసింగ్ ఎఇలు సర్ధార్, రామకృష్ణ,ఉపాధి ఎపిఓ చంద్రయ్య, మండల రాపూరు పంచాయితీ కార్యదర్శి కవిత, పలువురు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, పలువురు టిడిపి నేతలు తదితరులున్నారు.

## కండలేరులో 45.615 టీయంసీల నీటిమట్టం



**రాపూరు,ఏప్రిల్24ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయం నాటికి జళాశయంలో 45.615 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 345 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చోప్పున మొత్తం 425 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఆరుతడి పంటల పైన అవగాహన




**బిట్రగుంట ఏప్రిల్ 24 (ప్రభాతవార్త ):** బోగోలు మండలం ఉమామహేశ్వరపురం,కడనూతల గ్రామాలలో గురువారం రైతులకు ఆరుతడి పంటల సాగు పైన అవగాహన కల్గించారు.రైతులు తమ పొలాలను ఖాళీగా పెట్టకుండా ఆరుతడి పంటల సాగుపైన దృష్టి పెట్టాలని, అలాగే మట్టి నమూనా సేకరణ పైన కూడా కేంద్రికరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కావలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సిహెచ్. నాగరాజు, మండల వ్యవసాయశాఖ అధికారిణి విజయలక్ష్మి, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కార్యలయానికి వచ్చే ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



**రాపూరు,ఏప్రిల్24ప్రభాతవార్త :** ప్రతి నిత్యం గ్రామాల నుండి వివిద పనుల నిమిత్తం రెవెన్యూ ,యంపీడీఓ కార్యల యాలకు వచ్చే ప్రజల దాహర్తిని తీర్చే నిమిత్తం మండల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో మంచినీటి చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవాని తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉపాధ్యాక్షురాలు చిగురుపాటి ప్రసన్న, మండల ప్రజా పరిషత్ ఆధ్యక్షురాలు కుమ్మరిగుంట ప్రసన్నలతో కలసి ఆమె ప్రారింభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ సిఇఓ ఆదేశాల మేరకు వేసవిలో కార్యలయాలకు వచ్చే ప్రజల దాహర్తిని తీర్చే నిమిత్తం మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తోలిరోజు మజ్జిగ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఇకపై ప్రతి రోజు మట్టికుండలలో చల్లగా ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యలయం పరిపాలనాధికారి దామోదర్ రెడ్డి, సీనియర్,జూనియర్ సహాయకులు,సిఓ పి.చంద్రశేఖర్, ఉదయిని,కరుణాకర్, తెలుగుదేశం పార్టీ మండల ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, ఇరిగేషన్,హౌసింగ్ ఎఇలు సర్ధార్,రామకృష్ణ,ఉపాధి ఎపిఓ చంద్రయ్య, మండల విస్తరణాధికారి బాలకృష్ణా రెడ్డి,రాపూరు పంచాయితీ కార్యదర్శి కవిత,పలువురు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, పలువురు టిడిపి నేతలు తదితరులున్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



**అనంతసాగరం,ఏప్రిల్24,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఓ పి.ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ 1992లో భారత రాజ్యాంగం 73వ చట్ట సవరణ జరిగిందని ఈసవరణ ద్వారా గ్రామ, జిల్లా స్థాయిలో గ్రామ పంచాయతీల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందని ఆ సవరణ 1993 ఏప్రిల్24నుండి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ప్రతి ఏటా నిర్వహిస్తామని, పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం కేంద్ర ప్రంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి పెయ్యల సంపూర్ణ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, ఇఒపిఆర్‌డి , కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**కావలిరూరల్, ఏప్రిల్24 ప్రభాతవార్త :** జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గామ్‌లోని బైసారన్‌వద్ద 28 మంది యాత్రికులమీద ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తు న్నామని కావలి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్ తెలియచేశారు. ఉగ్ర వాదుల దాడిలో మృతిచెందిన కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూధన్ పార్థివదేహానికి గురువారం ఆయన స్వగృహంనందు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అద్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, కావలి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్, రాష్ట్ర నాయకులు ఎల్.సురేష్‌బాబు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కావలి నియోజకవర్గ నాయకులు పాల్గొని పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ సందర్భంగా పొదలకూరి కళ్యాణ్ మాట్లాడారు. ఉగ్రదాడిలో అమాయకులైన ప్రజలు 27మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, వారిలో కొంతమందికి గాయాలు కావడం జరిగిందని ఇలాంటి సంఘటనలు చాలా బాధాకరమని తెలియచేశారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలవారికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. గాయాలుపాలైవారు త్వరగా కోలుకోవాలన్నారు. వీరిలో ఇద్దరు తెలుగువారు కావడం అందులో ఒకరు కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణవాసి సోమిశెట్టి మధుసూధన్ మరణం మరింత బాధను కలిగిస్తుందని తెలియచేశారు. చనిపోయిన కుటుంబాలకు, గాయాలుపాలైన కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలవాలని తెలియచేశారు. ఉగ్రవాదంపై ఈ దేశయువత పోరుకు సిద్ధంగా ఉండవలసిన సమయం వచ్చిందని తెలియచేశారు. ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా కేంద్రప్రభుత్వం భద్రతాచర్యలను మరింత పటిష్టపరచాలని కోరారు. ఉగ్రదాడిలో మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢసానుభూతిని తెలియచేశారు.

## 26 న బోగోలు మండలమీట్

**బిట్రగుంట ఏప్రిల్ 24ప్రభాతవార్త :** బోగోలు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26 వ తేదీ సమావేశమందిరం నందు నిర్వహించడం జరుగుతుంది అని ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపిపి మేకల సుజాత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంకు అధికారులు పూర్తి సమాచారం తో హాజరుకావాలని ఆదేశించారు.

## చేజర్లలలో పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలు



**చేజర్ల ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో ని ఎంపిడిఓ కార్యాలయం నందు జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఓ విజయలలితా ఆద్వర్యంలో మహాత్మాగాంధీ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆమె జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం గురించి వివరించారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది పాల్గోన్నారు.

## బుచ్చిలో ఘనంగా పంచాయితీరాజ్ దినోత్సవం



**బుచ్చి ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.మొదట ఎంపిడిఓ శ్రీహరి, డిప్యూటి ఎంపిడిఓ నారాయణరెడ్డి జాతీపితా మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిడిఓ శ్రీహరి మాట్లాడుతు ప్రజల జీవన గమనంలో పంచాయితీరాజ్ వ్యవస్థ చాలా కీలకమైనదని అన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థ లేకుంటే చాలా శాఖలు స్తంభించి పోతాయని ఆయన తెలిపారు. పంచాయితీరాజ్‌శాఖలో పనిచేయడం మన అదృష్టంగా భావించాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో మండల కార్యాయలం సిబ్బంది, మరియు పంచాయితీ కార్యదర్శలు, డిజిటల్ అసిస్టెంట్స్, తదితరులు పాల్గోన్నారు.

## కోవ్వుత్తులతో నివాళులర్పించిన ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది



**బుచ్చి ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** పహల్గాంలో ఉగ్రవాదుల దాడులలో 26 మంది అమాయకులు బలికావడం చాలా బాదాకరమని ఎంపిడిఓ శ్రీహరి విచారం వ్యక్తం చేశారు. ఎంపిడిఓ సమావేశ మందిరంలో వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వుత్తులు వెలిగించి డిప్యూటి ఎంపిడిఓ నారాయణరెడ్డి, ఎఒ మంజుల, పంచాయితీ సెక్రటరీలు 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతు ఉగ్రవాదాలు అమాయ టూరిస్టులను టార్గెట్ చేసి చంపడం దారుణమని అన్నారు. ఈవిషయాన్ని ప్రతి భారతీయుడు ఖండించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గోన్నారు.

## ఉగ్రవాద దాడిలో మృతి చెందిన భారతీయ పౌరులకి సంతాపం



**ముత్తుకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మృతి చెందిన భారతీ య పౌరులకి సంతాపం సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ముత్తుకూరు సెంటర్ నందు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. భారతదేశం అన్న , భారత సైన్యం అన్న భారతీయుల అన్న వణుకు పుడుతున్న తీవ్రవాదులారా, భారత ఆర్మీ యూనిఫామ్ లో వచ్చి అమాయకుల ప్రాణాలు తీయడం కాదు దమ్ము ధైర్యం ఉంటే పోరాటం చేయగలిగే సత్తా ఉంటే ధైర్యంగా ముందుకు రావాలి తప్ప అమాయకులైన భారతీయ యాత్రికులని కాల్చి చంపటం పిరికితనం అన్నారు. ఇప్పటికే భారతీయ సైన్యం ఇద్దరిని వేరీ పారేసింది మిగిలిన నలుగురిని కూడా మట్టు పెడుతుంది భారత సైన్యం ఉగ్రవాదులకి ఎవరైతే మద్దతు తెలియజేశారో వారి అంతు కూడా చూస్తుందన్నారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ మూడు రోజులు పాటు కూడా సంతాప దినాలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, ముత్తుకూరు మండల అధ్యక్షుడు మనుబోలు గణపతి, సందూరి శ్రీహరి, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, గిరీష్, సుమన్, మస్తాన్, రహమాన్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

